తిరుమలలో జ్యేష్ఠాభిషేకం ప్రారంభం

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం శాస్త్రోక్తంగా జ్యేష్ఠాభిషేకం ప్రారంభమైంది. జ్యేష్ఠమాసంలో జ్యేష్ఠా నక్షత్రానికి ముగిసేట్టుగా ఏటా మూడురోజులపాటు ఈ జ్యేష్ఠాభిషేకం కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. 1990లో ఈ ఉత్సవానికి శ్రీకారం చుట్టారు. తొలిరోజు ఆలయంలోని సంపంగి ప్రదక్షిణంలో ఉన్న కల్యాణమండపంలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం రుత్వికులు శాంతి హోమం నిర్వహించారు. శతకలశ ప్రతిష్ఠ ఆవాహన, నవకలశ ప్రతిష్ఠ ఆవాహన, కంకణ ప్రతిష్ఠ అనంతరం స్వామి, అమ్మవార్లకు అర్ఘ్యం, పాద్యం, ఆచమనీయం చేసి కంకణధారణ చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామివారికి వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సహస్రదీపాలంకార సేవ అనంతరం ఉత్సవమూర్తులు వజ్రకవచంలో ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. గురువారం ముత్యపు కవచంతో, శుక్రవారం స్వర్ణకవచంతో స్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనమిస్తారు. కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్న జీయర్‌స్వామి, టీటీడీ ఈవో జే శ్యామలరావు దంపతులు, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంగా పవన్‌కల్యాణ్ బాధ్యతలు

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఏపీ ఉపముఖ్యమంత్రిగా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు దస్త్రాలపై సంతకాలు చేశారు. ఇటీవల మంత్రిగా ప్రమాణం చేసిన సమయంలో సినీ నటుడు చిరంజీవి భార్య, పవన్‌కు వదిన సురేఖ ఓ ఖరీదైన పెన్నును కానుకగా ఇచ్చారు. ఆ పెన్నుతోనే పవన్‌కల్యాణ్ సంతకాలు చేశారు. పలువురు మంత్రులు కలిసి అభినందనలు తెలిపారు. ఈనెల 24న సీఎం చంద్రబాబు అధ్యక్షతన తొలి మంత్రివర్గ సమావేశం నిర్వహించనుంది.

గోల్డెన్ అవర్ చాలా కీలకం

- సమయం మించిపోతే ప్రాణాలకే ప్రమాదం: అల్లు అరవింద్
- స్టార్ ట్రామా, యాక్సిడెంట్ రెస్పాన్స్ అంబులెన్స్‌ల ప్రారంభం

నానక్‌రామ్‌గూడలోని స్టార్ హాస్పిటల్‌లో జెండా ఊపి అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న సినీ నిర్మాత అల్లు అరవింద్, స్టార్ హాస్పిటల్ యాజమాన్యం

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 19 (నమస్తే తెలంగాణ): 'గోల్డెన్ అవర్ చాలా కీలకం...ఏదైన ప్రమాదం జరిగినప్పటి నుంచి గంటలోపు సరైన చికిత్స అందిస్తే ఆ రోగి ప్రాణాలు కాపాడవచ్చు. స్టార్ హాస్పిటల్ వారు ప్రమాద స్థలికి కేవలం 12-15నిమిషాల్లో చేరుకుని, ప్రమాదం జరిగిన ప్రాంతం నుంచే చికిత్స మొదలుపెట్టి, గోల్డెన్ అవర్‌లో రోగులను అంబులెన్స్‌లో దవాఖానకు తరలించే మహత్తర కార్యాన్ని చేపట్టడం అభినందనీయం' అని ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్ పేర్కొన్నారు. స్టార్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా.గోపీ చంద్ మన్నం, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డా.రమేశ్‌గూడపాటి, గ్రూప్ లీడ్, ఎమర్జెన్సీ మెడిసిన్ అధిపతి డా.రాహుల్ కట్టాతో కలిసి అల్లు అరవింద్ బుధవారం నానక్‌రామ్‌గూడలోని స్టార్ హాస్పిటల్‌లో 10 'ట్రామా, యాక్సిడెంట్ రెస్పాన్స్ నెట్‌వర్క్' అంబులెన్స్‌లను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నానక్‌రామ్‌గూడ పరిసరాల్లో ప్రమాదానికి గురైతే వెంటనే 9071104108కు, బంజారా హిల్స్ పరిసరాల్లో ఉన్నట్లైతే 9100911911 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయవచ్చని వివరించారు. ప్రస్తుతం 10అంబులెన్స్‌లను ప్రారంభించామని త్వరలో మరిన్నింటిని అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిపారు.

అంబులెన్స్ అందుబాటులో ఉండే ప్రాంతాలు

నార్సింగి, మణికొండ, టోలీచౌకి, గచ్చిబౌలి, కేపీహెచ్‌బీ, మియాపూర్, లింగంపల్లి, గౌలిదొడ్డి, మాదాపూర్, పటాన్‌చెరు ప్రాంతాల్లో ఈ స్టార్ ట్రామా, యాక్సిడెంట్ రెస్పాన్స్ అంబులెన్స్‌లను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు వివరించారు.

- కవ్వాల్ అడవుల్లో అరుదైన కప్ప

నిర్మల్ జిల్లా కడెం మండలం ఉడుంపూర్ రేంజ్ పెద్దవాగు పరిసరాల్లో అటవీ అధికారులు అరుదైన కప్పను గుర్తించారు. కవ్వాల్ టైగర్ రిజర్వు పరిధిలో డీఆర్వో ప్రకాశ్, ఎఫ్‌బీవో ప్రసాద్ గస్తీ తిరుగుతున్న సమయంలో వింత కప్ప కనిపించడంతో ఫొటోలు తీశారు. ఇండియన్ పెయింటెడ్ ఫ్రాగ్, శ్రీలంక బుల్ ఫ్రాగ్ పేర్లతో పిలిచే ఈ కప్ప చాలా తక్కువ ప్రాంతాల్లో కనిపిస్తుందని అధికారులు పేర్కొన్నారు. మొదటిసారి కడెం అటవీ ప్రాంతంలో వీటిని గుర్తించి, ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్టు డీఆర్వో తెలిపారు.

- కడెం

అంతర్జాతీయ 'సిమ్'దొంగల ఆటకట్టు

- ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు
- 113 సిమ్‌కార్డులు, 3మొబైళ్లు సీజ్

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): ఉత్తరప్రదేశ్ సహా దేశంలోని పలు రాష్ట్రాల్లో సిమ్‌కార్డులను సేకరించి దుబాయ్, థాయిలాండ్, కంబోడియా, చైనా వంటి దేశాలకు చట్టవిరుద్ధంగా విక్రయిస్తున్న ముగ్గురు అంతర్జాతీయ దొంగలను సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి 113 సిమ్‌కార్డులు, 3 మొబైల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొన్నారు. హైదరాబాద్ జగద్గిరిగుట్టకు చెందిన షేక్ సుభానీ, జీడిమెట్లకు చెందిన కే నవీన్, ఆర్టీసీ క్రాస్‌రోడ్‌కు చెందిన ఎం ప్రేమ్‌కుమార్ అలియాస్ మైఖేల్... వివిధ పేర్లతో సేకరించిన సిమ్‌కార్డులు సేకరిస్తారు. ఈ సిమ్‌కార్డులను దుబాయ్‌లోని విజయ్ ద్వారా దుబాయ్, థాయిలాండ్, కంబోడియా, చైనా తదితర దేశాల్లోని సైబర్ నేరస్థులకు రూ 1,500 నుంచి 3,000కు విక్రయిస్తున్నారు. దేశీయ నెంబర్లు కావడంతో ఆ నెంబర్ల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌ను వినియోగదారులు వారి పూర్తి సమాచారాన్ని సైబర్‌నేరగాళ్లకు వెల్లడించటం సులువు అవుతుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర సైబర్ క్రైం విభాగం అత్యంత చాకచక్యంగా కట్టడి చేయగలిగింది. ప్రధాన నిందితుడు విజయ్‌ను అరెస్టు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. కాగా, నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన పోలీసు అధికారుల బృందాన్ని సైబర్ క్రైం డైరెక్టర్ శిఖాగోయల్ అభినందించారు.

జూపార్క్ తరలింపు అవాస్తవం

- ఆ వార్తల్లో నిజం లేదు
- రాష్ట్ర వైల్డ్‌లైఫ్ చీఫ్ పీసీసీఎఫ్ మోహన్ పర్గేన్

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): నెహ్రూ జూలాజికల్ పార్క్‌ను షాద్‌నగర్‌కు తరలిస్తున్నట్టు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని తెలంగాణ వైల్డ్‌లైఫ్ చీఫ్ పీసీసీఎఫ్ మోహన్ పర్గేన్ స్పష్టంచేశారు. బుధవారం 'నమస్తే తెలంగాణ'లో 'షాద్‌నగర్‌కు జూపార్క్ తరలింపు' శీర్షికతో ప్రచురితమైన కథనంపై పీసీసీఎఫ్ స్పందించారు. జూపార్క్ తరలింపు ప్రక్రియ అంత సులువుగా జరిగేది కాదని పేర్కొన్నారు. నూతన స్థల ప్రతిపాదనల అనుమతులు, నిర్ణయాలు సెంట్రల్ జూ అథారిటీ ఢిల్లీ నుంచి తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. 1963లో స్థాపించిన జూపార్క్ ఇటీవలే 60 ఏండ్లు పూర్తి చేసుకున్నదని, ఇప్పటి వరకు 60 లక్షల మంది సందర్శకులకు ఆహ్లాదం పంచిన ఈ పార్క్‌ను తరలించాలనే ప్రతిపాదన అటవీశాఖకు లేదని స్పష్టంచేశారు.

సుప్రీంకోర్టు కేసులపైనా

లోక్‌అదాలత్

హైదరాబాద్,జూన్ 19 (నమస్తే తెలంగాణ): సుప్రీంకోర్టులో ఉన్న కేసులు కక్షిదారుల పరస్పర అంగీకారంతో రాష్ట్రంలోనే లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునే వెలుసుబాటు కలగనున్నది. సుప్రీం కోర్టు పెండింగ్ కేసులపై ఈ నెల 29 నుంచి ఆగస్టు 3 వరకు లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో తొలిసారిగా ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించబోతున్నారు. ఈ వివరాలను రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి సీహెచ్ పంచాక్షరి బుధవారం సమావేశంలో వెల్లడించారు. మధ్యవర్తిత్వానికి యోగ్యమైనవి రాష్ట్రంలో 295 కేసులున్నట్టు గుర్తించామని, లేబర్, మెయింటెనెన్స్, సర్వీస్, కుటుంబ, చెక్‌బౌన్స్ లాంటి ఎన్ఐఏ యాక్ట్ కేసులతోపాటు కొన్ని క్రిమినల్ కేసులు కూడా ఉన్నాయని చెప్పారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారానికి ముందుకొస్తే మండల, జిల్లా, రాష్ట్రస్థాయి లీగల్ సర్వీసెస్ అథారిటీని సంప్రదించవచ్చునని చెప్పారు. ఇరుపక్షాలు సంతకాలు చేస్తే వాటిపై సుప్రీంకోర్టు అవార్డు ఇస్తుందని వివరించారు. ఇప్పటికే మూడు కేసుల్లో కక్షిదారులు ముందుకు వచ్చారని తెలిపారు. వివరాలకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య 040-23446723 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

జూనియర్ ఎన్టీఆర్‌కు ఊరట

- డీఆర్టీ ఆదేశాలను రద్దు చేసిన హైకోర్టు ధర్మాసనం
- తిరిగి విచారించాలని ఉత్తర్వులు

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీలో స్థలం కొనుగోలు చేసి నిర్మించిన జూనియర్ ఎన్టీఆర్ ఇంటిపై బ్యాంకు హక్కులకు సంబంధించిన వివాదం పై విచారణ చేపట్టాలంటూ డీఆర్టీకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ వివాదానికి సంబంధించి ఇరు పక్షాల వాదనలను మళ్లీ విని నిర్ణయం తీసుకోవాలని డీఆర్టీని ఆదేశించింది. ఆ ఇంటిపై బ్యాంకులకు హక్కు లు ఉంటాయంటూ డీఆర్టీ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీలో 681 చదరపు గజాల స్థలాన్ని సుంకు గీత నుంచి 2007లో పిటిషనర్ కొనుగోలు చేశారని తెలిపారు. 1996లోనే ఈ స్థలాన్ని తాకట్టు పెట్టి స్థలం యజమాని రుణం పొందారని, అందువల్ల వాటిపై హక్కులు తమవేనంటూ ఎస్‌బీఐ, ఓబీసీ, ఇండస్, బ్యాంక్ ఆఫ్ బరోడా సర్ఫేసీ చట్టం కింద నోటీసులు జారీ చేశాయని వెల్లడించారు. ఈ నోటీసులను సవాల్ చేస్తూ జూనియర్ ఎన్టీఆర్ డీఆర్టీని ఆశ్రయించారని ఆయన తెలిపారు.

విచారణ కొనసాగించండి

- 'ఫోన్ ట్యాపింగ్'పై కోర్టు అనుమతి

నాంపల్లి కోర్టులు, జూన్ 19 (నమస్తే తెలంగాణ) : ఫోన్ ట్యాపింగ్ కేసులో తదుపరి విచారణ కొనసాగించేందుకు పంజాగుట్ట పోలీసులకు అనుమతిస్తూ కోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. చార్జిషీట్ దాఖలు చేసిన తర్వాత పూర్తి స్థాయి విచారణ కోసం అనుమతి కోరుతూ అధికారులు పిటిషన్ వేశారు. విచారణ పూర్తి చేసేందుకు సమయం సరిపోలేదని పీపీ కోర్టుకు తెలిపారు. పీపీ వాదనల ప్రకారం కోర్టు అనుమతి జారీ చేసింది. మరోసారి అదనపు చార్జిషీట్‌ను దాఖలు చేయనున్నట్టు అధికారులు వెల్లడించారు.

వైఎస్ జగన్‌ను కోర్టుకు హాజరు పరచాలి

- సీబీఐ పిటిషన్.. నేటినుంచి విచారణ

నాంపల్లి కోర్టులు, జూన్ 19 (నమస్తే తెలంగాణ): అక్రమాస్తుల కేసుల్లో ప్రధాన నిందితుడిగా ఉన్న ఏపీ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కోర్టుకు హాజరయ్యేలా ఆదేశాలివ్వాలని కోరుతూ సీబీఐ పిటిషన్ దాఖలు చేసింది. ముఖ్యమంత్రి హోదాలో కోర్టుకు హాజరయ్యేందుకు ఇబ్బందులున్నాయని గతంలో జగన్ పేర్కొనడంతో తెలంగాణ హైకోర్టు మినహాయింపునిచ్చింది. ఆయనపై 11 సీబీఐ, 9ఈడీ కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం జగన్ సీఎంగా లేడని, మినహాయింపును ఎత్తివేయాలని సీబీఐ హైకోర్టును కోరనున్నది. గురువారం నుంచి జరగనున్న విచారణలో హాజరుకావాలని కోరింది. వారానికి రెండ్రోజులైనా హాజరయ్యేవిధంగా ఉత్తర్వులు జారీ చేయాలని పేర్కొన్నది.

తల్లిదండ్రుల వాదన వినాల్సిందే

- పెండ్లి రిజిస్ట్రేషన్‌పై హైకోర్టు

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): వివాహ రిజిస్ట్రేషన్‌పై సబ్ రిజిస్ట్రార్‌కు ఉత్తర్వులు జారీ చేయాలంటే తొలుత పెండ్లి చేసుకునేవాళ్ల తల్లిదండ్రుల వాదన వినాల్సి ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. తల్లిదండ్రుల వాదన వినకుండా ఎలాంటి ఉత్తర్వులను జారీ చేయబోమని వెల్లడించింది. పెండ్లి రిజిస్ట్రేషన్ చేయాలంటే తల్లిదండ్రుల సంతకం కావాలన్న సబ్‌రిజిస్ట్రార్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ హైదరాబాద్‌లోని ఎస్ఆర్‌నగర్‌కు చెందిన వైదేహి, యూసఫ్‌గూడకు చెందిన యూసఫ్ నజీబుద్దీన్ హైకోర్టులో పిటిషన్ వేశారు. పెండ్లి చేసుకోబోయే వ్యక్తి ముస్లిం అని, అతడికి ఎలాంటి ఆదాయం లేనందున వివాహానికి అనుమతించొద్దని తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేయటంతో పెండ్లి రిజిస్ట్రేషన్‌కు సబ్‌రిజిస్ట్రార్ నిరాకరించారంటూ వారు హైకోర్టును ఆశ్రయించారు.

అమ్మకానికి 60 బొగ్గు గనులు

హైదరాబాద్ వేదికగా రేపు వేలం వేయనున్న కేంద్రం



హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం మరోసారి వాణిజ్య బొగ్గు గనులను వేలం వేయనున్నది. ఈసారి ఇందుకు హైదరాబాద్ వేదిక అవుతున్నది. గతంలో ఢిల్లీ, ముంబై, బెంగళూరు తదితర నగరాల్లో నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే ఈ 10వ విడుత కోల్ బ్లాక్స్ వేలాన్ని మాత్రం ఇక్కడ చేపడుతున్నారు. దీనిలో భాగంగానే శుక్రవారం (ఈ నెల 21) దేశవ్యాప్తంగా ఉన్న 60 బొగ్గు బ్లాక్‌లను మోదీ సర్కారు అమ్మకానికి తెస్తున్నది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి వేలం ప్రక్రియను ప్రారంభిస్తారు. ఆ శాఖ సహాయ మంత్రి సతీష్ చంద్ర దూబే, కార్యదర్శి అమృత్ లాల్ మీనాతోపాటు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనను న్నారు. ఎంఎస్‌టీసీ ప్లాట్‌ఫామ్‌పై వేలానికి సంబంధించిన వివరాలను పొందుపర్చారు. పర్సంటేజ్ రెవెన్యూ షేర్ మాడల్ ఆధారంగా ఆన్‌లైన్‌లో బొగ్గు గనుల వేలాన్ని నిర్వహిస్తారు. ఇక ఈ గనుల్లో కోకింగ్, నాన్-కోకింగ్ బొగ్గు బ్లాకులున్నాయి.

సింగరేణి పాల్గొనేనా..

ఈ బొగ్గు బ్లాక్‌ల వేలంలో సింగరేణి పాల్గొంటుందా? లేదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించిందా? లేదా? అన్నది కూడా స్పష్టత రావాల్సి ఉన్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణి నాడు వేలానికి దూరంగా ఉన్నది. కాగా, తెలంగాణలోని శ్రావణపల్లి బ్లాక్‌లో జీ-10 గ్రేడ్ బొగ్గు లభ్యమవుతుండగా, ఇక్కడ 119 మిలియన్ టన్నుల నిల్వలే ఉన్నట్టు తేల్చారు. దీంతో ఈ బ్లాక్‌పట్ల సింగరేణి ఆసక్తి చూపడం లేదు. ఆర్థికంగా అంత శ్రేయస్కరం కాదన్న భావనలో అధికారులున్నారు. ఇదే విషయంపై సింగరేణి సీఎండీ బలరాంను 'నమస్తే తెలంగాణ' సంప్రదించగా.. ఆర్థికంగా ఉన్న సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేస్తున్నామన్నారు. తర్వాతే వేలంలో పాల్గొనాలా? వద్దా? అన్నది నిర్ణయిస్తామన్నారు.

వేలాన్ని అడ్డుకుంటాం: రాజిరెడ్డి

బొగ్గు బ్లాకుల వేలాన్ని అడ్డుకొని సింగరేణిని కాపాడుకుంటామని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ప్రకటించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బొగ్గు బ్లాక్‌లతోపాటు ఇతర ఖనిజ నిల్వలను వేలం వేయకుండా కాపాడిన విషయాన్ని కార్మికులు గమనించాలని, ప్రైవేటీకరణను ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించబోమని ఆయన స్పష్టంచేశారు. వేలం వేస్తే ఇటీవల కొత్తగా ఉద్యోగాల్లో చేరిన 20 వేల మంది కార్మికుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుందన్నారు.

1.56 లక్షల కోట్లు

గత ఆర్థిక సంవత్సరం ప్రైవేట్‌పరమైన ప్రభుత్వ ఆస్తుల విలువ



వాటాల విక్రయం, డివిడెండ్లతో..

అందినకాడికి అమ్ముకుంటూపోతున్న మోదీ సర్కారు.. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ (సీపీఎస్ఈ)ల్లో వాటాల విక్రయం ద్వారా, ఆయా కంపెనీలిచ్చే డివిడెండ్లతో కూడా ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నది. ఇప్పటికే చాలా సంస్థల్లో వాటాలను తగ్గించుకున్న కేంద్రం.. ఎయిర్ ఇండియా వంటి సంస్థలను అడ్డగోలుగా మొత్తం విక్రయించిన సంగతి విదితమే. ఇక ఒక్క రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచే గత పదేండ్ల హయాంలో దాదాపు రూ.9 లక్షల కోట్లను డివిడెండ్‌గా అందుకున్నది. గత ఆర్థిక సంవత్సరానికైతే రికార్డు స్థాయిలో ఆర్బీఐ రూ.2.11 లక్షల కోట్ల డివిడెండ్‌ను ప్రకటించినది తెలిసిందే. మిగతా ప్రభుత్వ సంస్థల నుంచీ పెద్ద ఎత్తునే డివిడెండ్ ఆదాయం వస్తున్నది. అయినప్పటికీ కొత్త ఆదాయ మార్గాలను అన్వేషించకుండా ప్రభుత్వ ఆస్తుల అమ్మకాలకే కేంద్రం ఆసక్తి చూపుతుండటం ఇప్పుడు సర్వత్రా విమర్శలపాలవుతున్నది.

ఈ ఆర్థిక సంవత్సరం ఇంకో 2 లక్షల కోట్ల ఆస్తులు ఔట్

న్యూఢిల్లీ, జూన్ 19: గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో జాతీయ నగదీకరణ కార్యక్రమం (ఎన్ఎంపీ) కింద కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు రూ.1.56 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను అమ్మేసింది. నిజానికి రూ.1.80 లక్షల కోట్ల ఆస్తులను విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకోవడం గమనార్హం. బుధవారం వచ్చిన అధికారిక ప్రకటన ప్రకారం 2021-22 నుంచి 2024-25 వరకు మొత్తం నాలుగేండ్లలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని మౌలిక రంగ ఆస్తులను అమ్మి రూ.6 లక్షల కోట్ల నిధులను సమీకరించాలని బీజేపీ సర్కారు నిర్దేశించుకున్నది. ఈ క్రమంలోనే 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాల్లో దాదాపు 2.30 లక్షల కోట్ల ఆస్తులను అమ్మేసింది.

వచ్చే మార్చికల్లా..

2023-24తో కలిపితే మూడేండ్లలో రూ.4 లక్షల కోట్ల ఆస్తులను విక్రయించినట్టవగా, తొలి రెండేండ్లతో పోల్చితే తర్వాతి సంవత్సరంలోనే అత్యధికంగా అమ్మేయడం గమనించదగ్గ అంశం. ఇక లక్ష్యాన్ని చేరుకోవాలంటే వచ్చే మార్చి నాటికి ఇంకా రూ.2 లక్షల కోట్ల విలువైన ఆస్తులను అమ్మాల్సి ఉన్నది. దీంతో త్వరలోనే మరింత సర్కారీ సంపద.. ప్రైవేట్‌పరం కాబోతున్నది. ఇప్పటికే ఎన్‌హెచ్ఏఐ 33 ఆస్తులను కూడా గుర్తించింది. కాగా, రోడ్డు రవాణా-జాతీయ రహదారులు, బొగ్గు, విద్యుత్తు, గనులు, పెట్రోలియం-సహజ వాయువు, పట్టణాభివృద్ధి, షిప్పింగ్ తదితర మంత్రిత్వ శాఖల్లో ఆస్తుల అమ్మకాలకు సంబంధించి పెట్టుకున్న లక్ష్యంలో 70 శాతం పూర్తయినట్టు కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి.

గత ఆర్థిక సంవత్సరం కేంద్రం అమ్మేసిన ప్రభుత్వ ఆస్తులు

శాఖ	విలువ (రూ.కోట్లలో)
రోడ్డు రవాణా, జాతీయ రహదారులు	40,314
బొగ్గు	56,794
విద్యుత్తు	14,690
గనులు	4,090
పెట్రోలియం-సహజ వాయువు	9,587
పట్టణాభివృద్ధి	6,480
షిప్పింగ్	7,627
మరికొన్ని శాఖల్లో	16,500



120 కోట్లు దాటిన టెలికం కస్టమర్లు

న్యూఢిల్లీ, జూన్ 19: టెలికం వినియోగదారులు మళ్లీ 120 కోట్లు దాటారు. ఏప్రిల్ నెల చివరినాటికి దేశవ్యాప్తంగా 120.12 కోట్ల మంది టెలికం సబ్‌స్క్రైబర్లు ఉన్నారని టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. వీరిలో వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్లు 116.54 కోట్ల మంది ఉన్నారు. టెలికం దిగ్గజం రిలయన్స్ జియో దూసుకుపోతున్నది. కొత్తగా జియో నెట్‌వర్క్‌ను 26.8 లక్షల మంది ఎంచుకోవడంతో మొత్తం సంఖ్య 47.24 కోట్లకు చేరుకోగా, అలాగే భారతీ ఎయిర్‌టెల్‌కు 7.52 లక్షల మంది జతవడంతో 26.75 కోట్లకు చేరుకున్నారు.

ఏసీల ధరలకు రెక్కలు

8 శాతం వరకు భారీగా పెరిగిన విలువ

న్యూఢిల్లీ, జూన్ 19: ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుకోవడంతో సామాన్యులు సైతం ఏసీలను కొనుగోలు చేస్తున్నారు. ఈ వేసవి సీజన్‌లో ఏసీల విక్రయాలు రికార్డు స్థాయి రెండంకెల వృద్ధి నమోదైంది. అమ్మకాలు భారీగా పెరుగుతున్నాయన్న అంచనాతో వీటి ఉత్పత్తి సంస్థలు ఇదే అదనుగా ఏకంగా ధరలను కూడా భారీగా పెంచాయి. గతంలోనే ధరలను స్వల్పంగా పెంచిన సంస్థలు జూన్ నెలలో మరోసారి 6 శాతం నుంచి 8 శాతం వరకు సవరించాయి.

ఉత్పత్తి భారీ పెంపు..

డిమాండ్ అధికంగా ఉండటంతో ఏసీల తయారీ సంస్థలు తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని భారీగా పెంచాయి కూడా. సరఫరాలో ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు ఉపక్రమించాయి. టాప్ కంపెనీలైన వొల్టాస్, ఎల్‌జీ, లాయిడ్‌లు ఏకంగా తమ కెపాసిటీని రెండింతలు పెంచుకున్నాయి. ఏసీల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి లాయిడ్ పేరుతో ఏసీలను విక్రయిస్తున్న హావెల్స్ రూ.30-50 కోట్ల వరకు పెట్టుబడి కూడా పెట్టింది.

- ఈ ఏడాది ఏసీల విక్రయాలు 30-40 శాతం వృద్ధితో 1.5 కోట్ల యూనిట్లకు చేరుకుంటుందని ఇండస్ట్రీ వర్గాల అంచనా.
- దక్షిణాది కంటే ఉత్తరాదిలో ఎండలు తీవ్రంగా ఉండటంతో ఏసీ తయారీ సంస్థలు తమ ఏసీ స్టాక్‌లను దక్షిణాది నుంచి ఉత్తరాదికి తరలిస్తున్నారు.
- ఏసీల ఇన్‌స్టాలేషన్- సేవలు అందించే సిబ్బంది కొరత అధికంగా ఉన్నది.
- ఏసీల తయారీ సంస్థలైన వొల్టాస్, హావెల్స్‌లు తమ ఏసీల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించడానికి భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి.
- డిమాండ్ అధికంగా ఉండటంతో విడిభాగాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాయి సంస్థలు. ముఖ్యంగా కంప్రెషర్లు, మోటర్లు, పీసీబీ సర్క్యూట్స్‌లు ఉన్నాయి.

ఈ ఏడాది ఏసీ ఇండస్ట్రీకి గోల్డెన్ ఈయర్. దేశవ్యాప్తంగా అత్యధిక రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో జూన్ నెలలోనూ అమ్మకాలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి.

సంజయ్ చిత్కారా, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్

వాణిజ్య

టాటా కమర్షియల్ వాహనాలు ప్రియం

న్యూఢిల్లీ, జూన్ 19: టాటా మోటర్స్ మరోసారి వాహన ధరలను పెంచింది. జూలై 1 నుంచి అమలులోకి వచ్చేలా అన్ని రకాల కమర్షియల్ వాహన ధరలను 2 శాతం పెంచుతున్నట్లు బుధవారం ప్రకటించింది. కమోడిటీ ధరలు పెరగడం ఇందుకు కారణమని పేర్కొంది.

ఒమెగాలోకి 500 కోట్లు

హైదరాబాద్, జూన్ 19: హైదరాబాద్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ ప్రైవేట్ లిమిటెడ్(ఒమెగా హాస్పిటల్స్) తొలిసారిగా భారీ స్థాయిలో నిధులను సమీకరించింది. ఫండ్ మేనేజ్డ్ మోర్గాన్ స్టాన్లీ నుంచి రూ.500 కోట్ల నిధులు సేకరించినట్లు బుధవారం వెల్లడించింది. మరిన్ని రాష్ట్రాలకు విస్తరించడానికి, ముఖ్యంగా క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు నా